# స్వార్థం

**మధ్యాహ్నం మూడు గంటల వేళ.**

**శారద ఆటో దిగి డ్రైవరుకు డబ్బు లిచ్చి ఎదురుగా ఉన్న రెస్టారెంటులోకి నడిచింది. దాదాపు ఖాళీగా ఉన్న రెస్టారెంటులో ఒక మూలగా ఉన్న టేబిలు దగ్గర కూర్చున్న శరత్ వైపు వెళ్లింది.**

''ఇంత ఎండవేళప్పుడు కలుసుకోవాలని ఫోను చేశావేం శరత్? అర్జంటుగా మాట్లాడవలసిన విషయం ఏమైనా ఉందా?'' అని అడిగింది అతని కెదురుగా కూర్చుని వెయిటర్ తెచ్చిపెట్టిన మంచి నీళ్ల గ్లాసందుకుంటూ.

''అవును. మనమింక కలుసుకోవలసిన అవసరం లేదని అర్జంటుగా చెప్పేద్దామని రమ్మన్నాను'' అన్నాడు శరత్.

శారద తెల్లబోయింది.

''ఎందుకని?'' అడిగింది అయోమయంగా అతని వైపు చూస్తూ.

''మన పెళ్లి క్యాన్సిల్ చేస్తున్నాను కనుక'' అన్నాడు శరత్.

''అదేమిటి శరత్? మనం పర్సనల్‌గా కలుసుకోకముందే ఇంటర్‌నెట్, ఇ-మెయిల్ మనమధ్య ఇంటిమసీని పెంచి పెళ్లి చేసుకుందామనే నిర్ణయానికి వచ్చేలాగా చేశాయని, నిన్న మనం మొదటిసారిగా ముఖాముఖీ కలుసుకున్నప్పుడు చెప్పేవు. మీ పెద్ద వాళ్లని సంప్రదించి వీలైనంత త్వరలో పెళ్లికి ముహూర్తం పెట్టించమని మా నాన్నగారితో అన్నావు. అంతలోనే మనసు మార్చుకున్నావేం?'' అని అడిగింది శారద.

''నువ్వు దాచిన నిజం బయటపడింది కనుక'' అన్నాడు.

''నేను నిజాన్ని దాచానా?'' నివ్వెరబోతూ అడిగింది శారద.

''అవును. అమెరికాలో నువ్వు చేస్తున్న ఉద్యోగం పోయిందని ఈరోజు మీ నాన్నగారు మావాళ్లతో మాట్లాడుతూ క్యాజువల్‌గా చెప్పారట. అంత ముఖ్యమైన విషయాన్ని ముందుగా నాతో చెప్పకపోవటానికి కారణం, మూడుముళ్లు పడ్డాక నేనేమీ చెయ్యలేననే ధీమాయే అయి ఉంటుంది''

''ఎంత మాత్రం కాదు. కాకపోతే మనిద్దరం ఒకరినొకరం ఇష్టపడ్డాం కనుక నా ఉద్యోగం పోయినంత మాత్రాన పెళ్లి ఆగిపోతుందనుకోలేదు. నీకు లాగూ ఇక్కడ మంచి ఉద్యోగం ఉంది. నా క్వాలిఫికేషన్‌కు తగిన ఉద్యోగం దొరుకుతుందనే నమ్మకం నాకుంది. మంచి ఉద్యోగాలు చేసుకుంటూ అయిన వాళ్ల మధ్య ఆనందంగా బ్రతకగలమనుకున్నాను'' అంది శారద.

''అమెరికా జీవితాన్ని అనుభవించిన తర్వాత కూడా నువ్విక్కడ స్థిరపడటానికి ఎలా సిద్ధపడుతున్నావో నాకర్థం కావడం లేదు. నాకైతే నా బ్రతుకు సమస్తం అమెరికాలోనే ఉన్నట్టుగా అనిపిస్తూంది''

''అదేమిటి? అమెరికాలోనే పుట్టి పెరిగి బలవంతం మీద ఇండియాకు వచ్చినట్టు మాట్లాడుతున్నావే'' అంది శారద ఆశ్చర్యంతో.

''అమెరికాలో పుట్టి పెరిగి ఉంటే నీ కొంగు పట్టుకుని అక్కడికి వెళ్లవలసిన ఖర్మ నాకేమిటి? నాకు వీసా రిజెక్టవుతూ వుండడం వల్లనే నీతో



పెళ్లికి సిద్ధపడ్డాను. అంతేకాని మంచి ఉద్యోగాలు చేస్తున్న చక్కని అమ్మాయిలు, లక్షలకొద్దీ కట్నం కరువై కాదు'' అన్నాడు పెడసరంగా. అతని మాటలు విన్న శారద చిన్నబోయి కొంచెంసేపు మౌనంగా వుండిపోయింది.

''పెళ్లయిన తర్వాత నా ఉద్యోగం పోయి ఉంటే ఏం చేసేవాడివి?'' అని అడిగింది తేరుకుని.

''ఏముంది? ఉద్యోగం పోగొట్టుకున్న భార్యను పోషిస్తూ కష్టాలు పడకుండా నా దారిన నేను వెళ్లిపోయేవాడిని'' అన్నాడు శరత్ నిర్లక్ష్యంగా.

''అంటే... కష్టసుఖాల్లో తోడుగా ఉండవలసిన నువ్వు నీ స్వార్థం కోసం భార్యను వదిలెయ్యడానికి కూడా వెనకాడవన్నమాట'' అంది శారద. పైకి అందంగా కనబడుతున్న శరత్‌లోని వికృతమైన ఆలోచనలు తెలుసుకున్నాక ఆమెకు చీదరింపు కలిగింది.

''కచ్చితంగా అంతే! పెళ్లి వద్దనగానే నీ దారిన నువ్వు వెళ్లిపోతావనుకున్నాను. కానీ కారణం చెప్పమంటూ చర్చ పెట్టి నా టైము వేస్టు చేస్తావనుకోలేదు. వెళుతున్నాను'' అంటూ లేవబోతున్న శరత్‌ని ఆపింది శారద.

''రెండు నిమిషాల్లో వెళ్లిపోదువుగాని'' అంటూ తాగిన కూల్‌డ్రింక్స్‌కి బిల్లు తెమ్మని చెప్పి పే చేసి వెయిటరును పంపేసింది.

''నీ టైము వేస్టు చేసినందుకు సారీ శరత్! అయితే నన్ను కాదన్న తర్వాతే నీ నిజమైన వ్యక్తిత్వం, ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకునే అవకాశం ఇచ్చావు. థాంక్యూ వెరీమచ్'' శారద వ్యంగ్య ధోరణికి శరత్ ముఖం అవమానంతో, కోపంతో ఎర్రబడింది.

''నీకొక నిజం చెప్పేసి వెళ్లిపోతాను'' అంది శారద.

''ఏమిటది?'' అడిగాడు శరత్ అసహనంగా.

''నా ఉద్యోగం పోలేదు'' అంది శారద.

ఆ మాటలు వినగానే శరత్ స్తన్నుయ్యాడు.

''నువ్వు నన్ను ఇష్టపడుతున్నావో లేక అమెరికా రావడానికి పెళ్లి పేరుతో నన్ను వాడుకుంటున్నావో తెలుసుకోవాలని అనిపించింది. అందుకే ఉద్యోగం పోయిందని చెప్పేను. నేనాడిన నాటకం వల్ల నువ్వొక అవకాశవాదివి అని, పెళ్లిపేరుతో ఆడపిల్లను వాడుకుని అనుకోని ఇబ్బందులు ఎదురైనప్పుడు మూడుముళ్ల బంధాన్ని తేలిగ్గా తెంపేసి వెళ్లిపోగలిగే స్వార్థపరుడవని అర్థమైంది. నీ దుర్బుద్ధికి బలైపోకుండా నన్ను నేను కాపాడుకోగలిగాను. గుడ్‌బై'' అంటూ లేచి చకచకా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోతున్న శారద వైపు వెర్రిమొహం వేసుకుని చూస్తూండిపోయాడు శరత్.

**-జి. సరస్వతి (బెంగుళూరు)**